



# డా॥ సర్దార్ గౌతు లచ్చన్న

## శతజయంతి సంచిక

ఆంధ్రప్రదేశ్ | ఆదివారం 16 ఆగస్టు 2009 | 8 పేజీలు







## ప్రజల మనిషి-సర్దార్ లచ్చన్న

– యలమంచిలి శివాజీ

పుట్టింది వెనుకబడ్డ కులం. ఏ రోజుకారోజు నిత్య కృత్యానికే నానా తంటాలు పడే కుటుంబ ఆర్థిక పరిస్థితి. వెనుకబడ్డ ప్రాంతం. చదువా – వానాకాలం చదువు. చేపట్టింది. ప్రతిపక్ష రాజకీయాలు. వాటన్నిటితో కూడిన వారికి దుర్భరమైనది. అయినా శ్రీ లచ్చన్న ప్రజాసేవా నిరతి కవేవీ ప్రతిబంధకాలు కాలేదు. శ్రీ లచ్చన్న సిద్ధాంతాలతోనూ, విశ్వాసాలతోనూ ఏకీభవించని వారెవరైనా సరే – వారి ప్రజాసేవా నిరతిని ప్రశంసించక పోరు.

కమ్యూనిస్టుల ప్రభంజనంతో ఆంధ్రదేశం కొట్టుకుపోయిన ఎన్నికల్లో కూడ ఆ ఎదురుగాలిని ఎదుర్కొని శాసనసభకు ఎన్నికైనారు శ్రీ లచ్చన్న. శ్రీయుతులు ప్రకాశం పంతులు; ఆచార్యరంగా; సంజీవరెడ్డి; కళావెంకట్రావు; పళ్ళంరాజు; బ్రహ్మానందరెడ్డి, గోపాలరెడ్డి, కల్లూరి చంద్రమౌళి వంటి ఉద్దండులంతా ఓటమిని చవిచూచిన ఆ ఎన్నికల్లో శ్రీ లచ్చన్న నెగ్గుకు రావడం వారికున్న ప్రజాభిమానానికి తార్కాణం.


శ్రీకాకుళం జిల్లా "బారువా" గ్రామంలో 1909 ఆగస్టు 16న జన్మించిన శ్రీ లచ్చన్న 1930లోనే ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని కారాగారానికి నడిచారు. ఆనాటి 54 మంది నిర్బంధితులలో 46 మంది క్షమాపణ వ్రాసి; చెంపలేసుకొని బయటపడగా, జైల్లో మిగిలిన ఎనమండుగురులో శ్రీ లచ్చన్న ఒకరు. గాంధీ ఇర్విన్ ఒప్పందం ద్వారా విడుదలయిన శ్రీ లచ్చన్న, మద్యపాన నిషేధానికి వ్యతిరేకంగా ఇచ్ఛాపురం, సోంపేట తాలూకాల్లో పికెటింగ్‌లు జరిపించి, తనగౌడ కులం నుండి వెలివేయబడ్డారు. తమకల్లు గీత వృత్తికి దెబ్బవస్తుందని 32లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని ఆరు మాసాలు కఠిన కారాగార వాసం, విడుదలయిన వెంటనే గాంధీజీ ఎరవాడ జైలులో జరిపిన, నిరాహార దీక్షను పురస్కరించుకొని, హరిజన రక్షణ యాత్రలు జరిపి, గ్రామ, గ్రామాన వారికై, పెక్కు బావులు త్రవించారు శ్రీ లచ్చన్న. 1940 మేలో అండర్ గ్రౌండ్‌కు వెళ్ళేంత వరకూ, రైతు రక్షణ సమితుల ద్వారానూ, కాంగ్రెస్ పక్షాన పెక్కు ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పోలీసు ఠాణాలను స్వాధీన పరచుకొనే కార్యక్రమం మొదలు పెట్టగా 42లో నిర్బంధించబడి ఏడాదిపాటు కఠిన కారాగార శిక్షననుభవించి, విడుదలైన వెంటనే మరల నిర్బంధంలోపడి, 45 అక్టోబరు అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ వేవెల్ ప్రకటించిన సామూహిక బిక్షతో వెలుపలికొచ్చారు.

ఆది నుండి ఆవేశము ఊపిరిగా, పోరాటమే రాజకీయ జీవన విధాన మార్గాలుగా అలవాటు పడ్డ శ్రీ లచ్చన్నకు మంత్రిపదవిలో ఆనందం అగుపడక శ్రీ ప్రకాశం మంత్రివర్గం నుండి రాజీనామా ఇచ్చి, గీత కార్మికులతో ఆందోళన లేవదీసి, చివరికి అవిశ్వాస తీర్మానం ద్వారా మంత్రివర్గాన్ని పడగొట్టేంత వరకు నిద్రపోలేదు. 1965లో అదనపు భూమిశిస్తుకు వ్యతిరేకంగా సత్యాగ్రహోద్యమం జరిపి, సుప్రీం కోర్టు ద్వారా దాన్ని రద్దు చేయించినా, 72లో ప్రత్యేకాంధ్రోద్యమాన్ని నిర్మించి రథసారథ్యం వహించినా, 74లో జె.పి. ఉద్యమ సన్నాహ సమితికి రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డా – ఇటువంటి వాటన్నింటికీ శ్రీ లచ్చన్న వ్యక్తిత్వంలోనున్న రాజీలేని ఉద్యమకారుడే కారణం. దాని వెనుక ఒక మహోన్నతమైన ఆశయం – ఆదర్శం తొంగి చూస్తుంటాయి.

1967 సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంటుకు, శాసనసభకు కూడా ఎన్నికై, పార్లమెంటుకు రాజీనామా ఇచ్చి, ఆ ఖాళీతో ఆచార్య రంగాను నెగ్గించి, వారి ఎడ తనకున్న గురుభక్తిని నిరూపించుకొన్నారు. అయితే అదే ఆచార్య రంగా, కాంగ్రెస్‌లో చేరడాన్ని వ్యతిరేకించి, తాను ప్రతిపక్షంలోనే మిగిలిపోయారు. ఆ తర్వాత అత్యవసర పరిస్థితన్నాళ్ళు 19 మాసాలు కటకటాల మధ్య కాలం గడుపవలసి వచ్చినా, తన కుటుంబం అష్టకష్టాల నెదర్కొనవలసి వచ్చినా, ఉన్న ఇల్లు అమ్ముకొన వలసి వచ్చినా, నిత్యావసరాలు గడవటమే దుర్భరమై పోయినా – ఇవేమీ శ్రీ లచ్చన్నను చలింప చేయలేక పోయాయి.












## 'స్వరాజ్యం' వచ్చాకే నా పెళ్ళి


### 14 ఏళ్ళకే లచ్చన్న పెళ్ళి

గౌతు లచ్చన్న తండ్రిగారు చిట్టయ్యకు ఒకసారి పెద్ద జబ్బుచేసింది. తను బతికి బయటపడి బట్టకట్టగలనో లేదోనని ఆయనకు అనుమానం కలిగింది. బాల్య వివాహాలు చాలా మామూలైన ఆరోజుల్లో, తను బతికి ఉండగానే కొడుకుల పెళ్ళిళ్లు చెయ్యాలని, అప్పటి కప్పుడు కులాచారం మేరకు పెళ్లిళ్లు జరిపించారు. ఆ విధంగా 1923లోనే లచ్చన్నగారికి ఆయన 14వ యేట వివాహం జరిగింది. ఆ తర్వాత కొంత కాలానికి లచ్చన్న గారి భార్యకు మశూచికం సోకడంతో, అన్నెంపున్నెం ఎరుగని ఆ పిన్న వయసులోనే ఆమె పసుపుకుంకుమలతో కాలంచేశారు.

### యశోదా దేవితో లచ్చన్న రెండోపెళ్ళి

యుక్త వయసు వచ్చిన తర్వాత మళ్లీ లచ్చన్న గారికి వివాహం చేయ్యాలని ఇంట్లో వాళ్లు ప్రయత్నాలు ప్రారంభించారు. ఐతే, స్వాతంత్ర్యం తర్వాతే, తను పెళ్లి చేసుకొంటానని పట్టుబట్టి, 35 సంవత్సరాల తర్వాత కూడా ఆ మాట మీదే ఉండి ఆయన వివాహం చేసుకోలేదు. 1948వ సం॥ మార్చి 28వ తేదీన శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలుకా బారువలో, బారువ పుర ప్రజల ఆధ్వర్యంలో ఆయన వివాహం జరిగింది. వధువు శ్రీకాకుళం వాస్తవ్యులు, రిటైర్డ్ తహసీల్దారు కశింకోట రుద్రదేశ్ మనుమరాలు యశోదాదేవి. ఆ వివాహం జరిగిన నేపథ్యం ఆసక్తి దాయకమైనది.

జంషెడ్‌పూర్ ఆంధ్ర సంఘం వారు లచ్చన్న గారిని సన్మానం చేసిన సందర్భంలో – సన్మాన సభ అయిన తర్వాత ఆయన ఆరోజు రాత్రి డా॥ పిట్టా బాలకృష్ణమూర్తి గారింట్లో భోజనం చేస్తున్నారు. అప్పుడు మాటల సందర్భంలో లచ్చన్నగారి వివాహ ప్రసక్తి వచ్చింది. అప్పటికి ఆయన వయసు 36 సంవత్సరాలు. "ఈ వయసులో నాకెవరు పిల్లనిస్తారు?" అన్నారు లచ్చన్న నవ్వుతూ. "ఇచ్చే వారుంటే పెళ్లి చేసుకుంటారా?" అని అడిగారు డాక్టర్ మూర్తిగారు. అంతేకాదు ... తన అక్కయ్యగారు తమ కుమార్తె నిచ్చి పెళ్లి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.



"నేను మా అన్నయ్య క్విట్ ఇండియా ఉద్యమకాలంలో జైలులో ఉన్నకాలంలో ఈ పూరిళ్ళు కూలిపోయాయి. ఎలిమెంటరీ స్కూల్‌లోటీచర్‌గా ఉన్న మా అన్నయ్య అద్దె ఇంట్లో ఉంటూ నాకు తిండి పెడుతున్నాడు. నా రాజకీయ జీవితంలో నేను సంపాదించే అవకాశమే లేదు. ఎప్పుడు ఎక్కడ ఉంటానో తెలియదు. నన్ను కట్టుకుంటే, తిండి, గుడ్డ, గూడుకు కష్టపడాల్సి వస్తుంది. అని అప్పటికప్పుడు ఓ ఉత్తరం రాసిచ్చారు లచ్చన్న. ఈ ఉత్తరం తనను భయపెట్టడానికే రాశానని భావించి, నాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. పెళ్లి చేసుకుంటానని యశోదాదేవి పెళ్లికి అంగీకరించారు. ఆ తర్వాత తన గురువు ఆచార్య ఎన్.జి. రంగా అనుమతి కావాలని మరో షరతు పెట్టారు లచ్చన్న.

అప్పుడు యశోదాదేవి వేనమామ డా॥మూర్తి, లచ్చన్న అన్నగారిని తోడుగా తీసుకుని, రంగాగారి వద్దకు వెళ్లి, వధువు యశోదాదేవి పోషణబాధ్యత తామే వహిస్తామని, లచ్చన్న గారికి ఎలాంటి పూచీ ఉండదని ఒక ఒప్పందం రాసిచ్చి, గురువుగారి దగ్గర్నుంచి వివాహానికి అనుమతిని సంపాదించారు. ఆతర్వాతే బారువ గ్రామంలో లచ్చన్న, యశోదాదేవి గార్ల వివాహం జరిగింది!

# గౌతులచ్చన్న సాగించిన మహాప్రస్థానంలో అనేకమైలు రాళ్ళు - ఉద్యమాల సవాళ్ళు

**గౌతు లచ్చన్న జీవితం వడ్డించిన విస్తరికాదు. వెనుకబడిన తరగతుల కుటుంబంలో అష్టమ సంతానంగా పుట్టి, అష్టకష్టాలు పడి, తిండి గడవక, చదువు సాగక, బతుకుదారిలో పల్లేరుల్ని తొక్కుకుంటూ, సామాజికమైన ఆర్థికమైన అవరోధాలను దాటుకుంటూ పయనం సాగించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనడంతో స్వాతంత్ర్య సమర బాటలో ప్రవేశించారు. అక్కడి నుంచి ఆయన దిశమారింది. స్వాతంత్రేచ్ఛతో పాటు బడుగువర్గాల అభ్యున్నతి లక్ష్యంగా మారింది. అక్కడి నుంచి చివరి శ్వాస వరకు ఆయన వెనుతిరిగి చూడలేదు.**

| | |
|---|---|
| ఆగస్టు 16, 1909 | శ్రీ గౌతు చిట్టెయ్య, రాజమ్మ దంపతుల అష్టమ సంతానంగా శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో జననం. |
| 1916 | అక్షరాభ్యాసం |
| 1921 - 23 | బారువలోని హయ్యర్ ఎలిమెంటరీ స్కూలులో విద్యాభ్యాసం |
| 1930 | శ్రీకాకుళం హైస్కూలు నుండి యస్.యస్.ఎల్.సి. ఉత్తీర్ణత |
| ఏప్రియల్ 21 | శ్రీకాకుళం జిల్లా నౌపడాలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టు కావడం ద్వారా స్వాతంత్ర్యసమరంలో ప్రవేశం. టెక్కలి, నరసన్నపేట, జైళ్లలో 50 రోజుల రిమాండు, బరంపురం జైలులో నెలరోజుల శిక్ష. |
| 1931 | బారువలో సత్యాగ్రహ శిబిరం ఏర్పాటు, సోంపేట, ఇచ్ఛాపురం తాలూకాలలో కల్లుకొట్టు, విదేశీ వస్తు దుకాణా వద్ద పికెట్టింగ్‌ల నిర్వహణ. బరంపురం, కాకినాడలలో కాంగ్రెస్ సేవాదళ్ శిబిరాలలో శిక్షణ. |
| 1932 | శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా బారువలో సత్యాగ్రహ శిబిరం ఏర్పాటు. కాంగ్రెస్ జండాల ప్రతిష్ఠాపన - పోలీసుల లాఠీ చార్జి. రాజమండ్రిలో ఆరుమాసాల జైలుశిక్ష, జైలులో బెంగాలు విప్లవకారులతో పరిచయం. |
| నవంబరు 7, 1933 | ఆచార్య రంగాతో తొలిపరిచయం. విప్లవ వీరులను కలిసేందుకు ఒరిస్సా, బెంగాలు రాష్ట్రాల పర్యటన. |
| ఫిబ్రవరి 19, 1935 | గుంటూరులో ఏర్పడిన ఆంధ్ర కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక. ఉత్తర విశాఖ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నిక. |
| 1935-37 | నిడుబ్రోలులో ఆచార్య రంగాచే నిర్వహించబడిన రామానీడు వేసంగి రైతాంగ విద్యాలయంలో ఆరు మాసాల శిక్షణ. |
| 1936 | న్యాయవతి నారాయణమూర్తి, పుల్లెల శ్యామసుందరరావుల నాయకత్వంలో పర్లాకిమిడి నుంచి ఛత్రిపూర్ వరకు రైతు రక్షణయాత్ర నిర్వహణ. |
| 1936-51 | అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎ.ఐ.సి.సి.) సభ్యత్వం |
| 1937 | టెక్కలి నియోజకవర్గం నుండి మద్రాస్ రాష్ట్రశాసన సభకు గురువు శ్రీ పుల్లెల శ్యామసుందరరావు ఎన్నికకు అవిరళ కృషి. |
| 1937-38 | శ్రీ జయప్రకాశ్ నారాయణ్‌తో ఆంధ్ర రాష్ట్రపర్యటన |
| ఆగస్టు 27, 1938 | 45 రోజులపాటు ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు 700 మైళ్ళదూరం కాలినడకన సాగిన రైతుయాత్ర అనంతరం నాటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రాజగోపాలాచారికి విజ్ఞాపన పత్రం సమర్పణ. నాటి కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు స్వర్గీయ కొమ్మారెడ్డి సత్యనారాయణ నాయకత్వంలో సాగిన ఈ చారిత్రాత్మక రైతు యాత్రలో కీలకపాత్ర నిర్వహణ. తండ్రి శ్రీ చిట్టెయ్య మరణం. బారువ పంచాయితీ అధ్యక్షునిగా ఎన్నిక. |
| 1939 | నేతాజీ సుభాస్ చంద్రబోస్ స్థాపించిన ఫార్వర్డు బ్లాక్‌లో చేరిక. బోసు దక్షిణభారత పర్యటనలో అనుసరణ. |
| 1940 | నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి పలాసలో ఒకటిన్నర లక్షల ప్రజల సమక్షంలో అఖిల భారత కిసాన్ సభ నిర్వహణ, ఈ మహాసభ ఆహ్వానసంఘ ప్రధాన కార్యదర్శిగా విశేషకృషి. |
| మే 1940-43 | అజ్ఞాతవాసంలో ఉండి స్వరాజ్య సమర నిర్వహణ క్విట్ ఇండియా ఉద్యమంలో కీలకపాత్ర రహస్యం "రణభేరి" ప్రతిక సంపాదకత్వం బ్రిటీస్ ప్రభుత్వంచే "పట్టుకుంటే పదివేలు" ప్రకటన "కనిపిస్తే కాల్చివేత"కు ఉత్తర్వులు. |
| 1943 | రాజమండ్రిలో అనుకోని విధంగా అరెస్టు కావడం |
| 1943-45 | అల్లిపురం, కన్ననూర్, తంజావూరు, రాయవెల్లూరులలో కారాగారవాసం |
| 1945 | ఏలూరులో ఇండియన్ నేషనల్ ఆర్మీవీరులకు సన్మాన కార్యక్రమం నిర్వహణ. ఆంధ్ర కాంగ్రెస్ కమిటి సహాయ కార్యదర్శిగా కాంగ్రెస్ సేవాదళ్, కార్మిక విభాగాల నిర్వాహణ. పలాసలో మూడు నెలలు కాంగ్రెస్ సేవాదళ్ ఆఫీసర్ల శిక్షణాశిబిరం నిర్వహణ. |
| 1946 | ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సహాయ కార్యదర్శిగా ఎన్నిక ఉత్తర విశాఖ జిల్లా కాంగ్రెస్ సంఘం అధ్యక్షునిగా ఎన్నిక. |
| ఆగస్టు 12, 1947 | ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐ.యన్.టి.యు.సి) ఆంధ్ర విభాగం స్థాపన, అధ్యక్షునిగా ఎన్నిక. |
| 1947-52 | ఐ.యన్.టి.యు.సి. ఆంధ్ర విభాగానికి అధ్యక్షునిగా కార్మికోద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహణ. |
| ఆగస్టు 1948 | శ్రీమతి యశోదాదేవితో వివాహం. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సహాయకార్యదర్శిగా ఎన్నిక. విశాఖపట్నం సింధియా షిప్ బిల్డింగ్ లేబరు యూనియన్ అధ్యక్షునిగా కార్మికుల హక్కుల కోసం పోరాటం. విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల కార్మిక నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఎన్నిక. |
| 1949 | విశాఖపట్నం సింధియా కంపెనీచే నిర్మించబడిన మూడవ ఓడవే జలప్రవేశం చేయించడం (మొదటి, రెండవ ఓడలను జవహర్‌లాల్ నెహ్రు, సర్దార్ పటేల్ జలప్రవేశం చేయించారు). |
| 1949-52 | ఐ.యన్.టి.యు.సి.జాతీయ కమిటీ ఉపాధ్యక్షునిగా కార్మిక ఉద్యమాలలో చురుకుగా పాల్గొనడం. |
| 1951 | కృషికార్ లోక్‌పార్టీ సహాయ కార్యదర్శిగా ఎన్నిక |
| 1952 | సోంపేట నియోజకవర్గం నుండి కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థిగా మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఎన్నిక, మద్రాసు అసెంబ్లీలో కె.యల్.పి. నాయకునిగా ఎన్నిక. గుంటూరులో జరిగిన ఆంధ్రరాష్ట్ర వెనుకబడిన తరగతుల ప్రథమ మహాసభకు అధ్యక్షత, ఆంధ్రరాష్ట్ర వెనుకబడిన తరగతుల సంఘం అధ్యక్షునిగా ఎన్నిక. భీమవరంలో జరిగిన ప్రథమ ఆంధ్రరాష్ట్ర గీత పారిశ్రామిక మహాసభకు అధ్యక్షత. రాష్ట్ర గీత పారిశ్రామిక సంఘాధ్యక్షులుగా ఎన్నిక. |
| 1953 | ఆంధ్ర రాష్ట్రావతరణ సందర్భంగా ఆంధ్ర ప్రాంతానికి రావలసిన ఆస్తుల విభజన కమిటీ సభ్యత్వం. |
| నవంబరు 7, 1953 | ప్రకాశం మంత్రివర్గంలో వ్యవసాయ, కార్మిక శాఖామంత్రిగా చేరిక. |
| జనవరి 1954 | రాజధాని వివాదంపై మంత్రి పదవికి రాజీనామా, భార్య శ్రీమతి యశోదాదేవితో కలిసి గీత కార్మికుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమనిర్వహణ ప్రకాశం మంత్రి వర్గంపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదన. తల్లి శ్రీమతి రాజమ్మ మరణం. |
| 1955 | సోంపేట నియోజకవర్గం నుండి ఆంధ్రరాష్ట్ర శాసనసభకు ఎన్నిక |
| 1955-56 | గోపాలరెడ్డి మంత్రివర్గంలో విద్యుచ్ఛక్తి, కార్మిక, సాంఘిక సంక్షేమ శాఖలమంత్రిగా బహుముఖ కృషి. |
| ఫిబ్రవరి 20, 1956 | ఆంధ్రప్రదేశ్ అవతరణకు దారితీసిన పెద్దమనుషుల ఒప్పందంపై సంతకం. |
| ఫిబ్రవరి 1956 | కాంగ్రెసుకు రాజీనామా, చెన్నారెడ్డితోకలసి డెమాక్రాటిక్ ఫ్రంట్ ఏర్పాటు. ఆంధ్రప్రదేశ్‌లో స్వతంత్రపార్టీ నిర్మాణం. రాష్ట్ర స్వతంత్రపార్టీ ఉపాధ్యక్షునిగా ఎన్నిక. |
| 1959-72 | స్వతంత్రపార్టీ కేంద్ర కార్యవర్గ సభ్యత్వం |
| 1960 | 'బహుజన' పత్రిక ప్రారంభం |
| 1961 | మీరట్‌లో జరిగిన స్వతంత్ర పార్టీ జాతీయ మహాసభలో వెనకబడిన తరగతుల సంక్షేమానికి ప్రతిపాదనలను ఆమోదింపచేయడం. |
| 1962 | స్వతంత్రపార్టీ అభ్యర్థిగా ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నిక. |
| 1965 | అదనపు భూమి శిస్తుకు వ్యతిరేకంగా సత్యాగ్రహ ఉద్యమాలు నడిపి సుప్రీంకోర్టు ద్వారా దాన్ని రద్దు చేయించడం. |
| 1967 | స్వతంత్రపార్టీ అభ్యర్థిగా శ్రీకాకుళం నియోజకవర్గం నుండి లోకసభకు, సోంపేట నియోజకవర్గం నుండి రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నిక లోక్ సభ సభ్యత్వానికి రాజీనామా చేసి ఆ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలలో గురువు ఆచార్య రంగాను గెలిపించడం. |
| 1967-71 | ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రతిపక్ష నాయకునిగా, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ అధ్యక్షునిగా ప్రముఖ పాత్ర నిర్వహణ. |
| 1969 | అనకాపల్లిలో షష్ఠిపూర్తి మహోత్సవం. |
| 1972-73 | ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమనాయకత్వం శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా |
| 1974 | జయప్రకాష్ నారాయణ ఉద్యమ సన్నాహక సమితి రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షునిగా ఎన్నిక |
| 1975 | శ్రీ జయప్రకాష్ నారాయణ, తెన్నేటి విశ్వనాధంలతో కలసి ఆంధ్రరాష్ట్ర పర్యటన |
| జూన్ 26, 1975-77 | అత్యవసర పరిస్థితి విధింపు. 19 నెలల కారాగారవాసం |
| 1977 | ఆంధ్రప్రదేశ్‌లో జనతాపార్టీ నిర్మాణంలో కీలకపాత్ర |
| 1978 | సోంపేట నియోజకవర్గం నుండి జనతాపార్టీ అభ్యర్థిగా రాష్ట్ర శాసనసభకు ప్రతిపక్ష నాయకునిగా ఎన్నిక |
| 1979 | లోక్‌దళ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగానికి అధ్యక్షునిగా ఎన్నిక |
| ఆగస్టు 16, 1982 | నెల్లూరులో 73వ జన్మదిన మహోత్సవం నిర్వాహణ. అభినందన సంచిక ప్రచురణ. ఆంధ్రప్రదేశ్ సోషల్ అండ్ ఎకనామిక్ వెల్‌ఫేర్ ట్రస్టు ఏర్పాటు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాష్ట్రంలో కాంగ్రేసేతర ప్రతిపక్షాల సయోధ్యకు కృషి. |
| 1983 | 'మహాజన' వారపత్రిక ప్రారంభం. |
| ఏప్రియల్ 1983 | లోక్‌దళ్ ఆంధ్రప్రదేశ్ విభాగం రద్దు |
| 1984 | ఆంధ్రప్రదేశ్ హరిజన గిరిజన వెనుకబడిన అల్ప సంఖ్యాక వర్గాల పార్టీ ఏర్పాటు |
| 1985 | స్వర్గీయ కర్పూరీ ఠాకూర్‌తో కలసి జాతీయ స్థాయిలో లోక్‌దళ్‌పార్టీ సమైక్యతకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో 'ఆంధ్రప్రదేశ్ లోక్‌దళ్' అనే ప్రత్యేకపార్టీ ఏర్పాటు. పార్టీకి అధ్యక్షునిగా ఎన్నిక. |
| 1986 | తిరుపతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల మహాసభలో "ఆచార్య" బిరుదు ప్రదానం |
| 1986-88 | ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంఘం ఆధ్వర్యంలో వెనకబడిన తరగతుల హక్కుల పరిరక్షణకు ఉద్యమ నిర్వాహణ |
| 1988 | ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు మూడవ ప్రత్యామ్నాయంగా సి.పి.ఐ. ఆంధ్రప్రదేశ్ లోక్‌దళ్, రిపబ్లికన్ పార్టీ, యమ్.సి.పి.ఐ.లతో ఏర్పడిన వామపక్ష ప్రజాస్వామ్య సంఘటనకు నాయకత్వం. |
| ఆగస్టు 1989 | గుంటూరులో 81వ జన్మదినమహోత్సవం, పౌర సన్మానం, అభినందన సంచిక ప్రచురణ |
| ఫిబ్రవరి 1, 1990 | భారత ఉపప్రధాని శ్రీ దేవీలాల్ సమక్షంలో విశాఖపట్నంలో తన నాయకత్వంలో గల ఆంధ్రప్రదేశ్ లోక్‌దళ్ పార్టీని జనతాదళ్‌లో విలీనం చేయడం. |
| మే 5, 1990 | రాజమండ్రిలో అరవై సంవత్సరాల ప్రజాసేవా షష్ఠిపూర్తిమహోత్సవం, ప్రముఖుల సమక్షంలో వైభవంగా నిర్వహణ. "నీరాజనం" అభినందన సంచిక ప్రచురణ. శ్రీ వంగపండు అప్పలస్వామి రాసిన "సర్దార్ గౌతు లచ్చన్న జీవిత చరిత్ర" గ్రంథావిష్కరణ |
| ఆగస్టు 1991 | 84వ జన్మదిన "సహస్ర చంద్రదర్శనం"గా జరుపబడింది |
| 1993-94 | బి.యస్.పి. పార్టీలో చేరటం విరమించటం |
| మార్చి 1996 | ధర్మపత్ని శ్రీమతి యశోదాదేవి నిర్యాణం |
| ఆగస్టు 1997 | ఆంధ్ర విశ్వవిద్యాలయం వారిచే గౌరవ డాక్టరేట్ ప్రదానం. హైదరాబాద్ "గ్లో" సంస్థ స్థాపన |
| ఏప్రిల్ 19, 2006 | సర్దార్ గౌతు లచ్చన్న నిర్యాణం. |













తన అంగ రక్షకుడు







# సమరజీవి 'సర్దార్'

ప్రజల సమస్యల పరిష్కారం కోసం అటు తెల్లదొరలతోనూ, ఇటు నల్లదొరలతోనూ సమానంగా పోరాడిన యోధుడు గౌతు లచ్చన్న. ఆయనకు ప్రజలిచ్చిన బిరుదు సర్దార్. ఆయన కన్ను మూసినా ఆయన వెలిగించిన చైతన్యజ్యోతి శ్రామిక రైతాంగ హృదయాల్లో శాశ్వతంగా వెలుగుతూనే ఉంటుంది. రాష్ట్ర రాజకీయాలలోని ప్రధాన ఘట్టాలన్నిటితోనూ ఆయన జీవితం ముడిపడి ఉన్నది.

మహాత్మాగాంధీ ప్రారంభించిన ఉప్పు సత్యాగ్రహం నిప్పై రగులుతున్న రోజుల్లో లచ్చన్న ఉద్యమ ప్రవేశం జరిగింది. నౌపడ ఉప్పు కొఠారులను ధ్వంసం చేసి 1930 ఏప్రిల్‌లో కారాగారాన్ని వరించిన లచ్చన్న ఇక వెనుకడుగు వేయలేదు. ఆయన ఉద్యమం పరాయి పాలనపైన తిరుగుబాటుకే పరిమితం కాలేదు. జమీందారీ రైతాంగ సమస్యలపై సంధించిన అస్త్రమైంది. జనం గుండెలోతుల్లో దాగిన బాధామయ గాథలకు పరిష్కారం కనుగొనడమే ఏ ఉద్యమానికైనా పరమార్థమని నమ్మిన సమరశీలి ఆయన. బడుగువర్గాల బాగు కోసం పరితపించేటట్లు కనిపించే నేతలంతా పదవులొచ్చాక ప్లేటు ఫిరాయిస్తుంటే, అందుకు భిన్నంగా లచ్చన్న బహుజనులకు అండగా కడవరకూ నిలిచారు. ఎన్ని పోరాటాలు చేసినా, ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఎన్ని పదవులు వెదుక్కుంటూ వచ్చినా అన్ని సందర్భాలలోనూ ఆయనకెదురైనవి ముళ్ళబాటలే. స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాలు కాంక్షించే వారిని ఒకవైపు ఎదిరిస్తూనే మరోవైపు రైతులను పీల్చి పిప్పి చేస్తున్న జమీందారీలను ప్రతిఘటించాల్సిన తరుణమది. లచ్చన్నను దేశభక్త్యావేశం ముందుకే నడిపించింది. దేహదారుఢ్యం తగ్గిన తరువాత కూడా లక్ష్యాన్ని సాధించి తీరాలన్న పట్టుదల మాత్రం తగ్గలేదు.

రాజకీయ జీవితంలో పదవులను పట్టుకుని వేలాడాలన్న కాంక్షగానీ, అధికార వ్యామోహం గానీ ఆయనలో కనిపించవు. బలహీనవర్గాల సంక్షేమానికై నిత్య ప్రయోగాత్మకంగా జీవించడమే ఆయన అభిమతం. సర్వశక్తులను అందుకోసమే ధారపోశారు. పదవులు లభించినప్పుడు పొంగిపోనూలేదు. అవి దూరమైనప్పుడు కుంగిపోనూ లేదు. సర్వకాల సర్వావస్థల్లోనూ స్థితప్రజ్ఞతతోనే ముందుకు సాగారు. పదకుర్చీ రాజకీయాలు లచ్చన్నకు సరిపడవు. ఉద్యమ స్ఫూర్తితో ఉత్తరాంధ్రలో ఊరూరా తిరిగి పెల్ల రైతుల గుండెల్లో విప్లవజ్యోతులు వెలిగించారు. అరవై ఎనిమిదేళ్ల కిందట పాతిక వేలమంది రైతులను ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకు 1600 కిలోమీటర్లు పాదయాత్ర చేయించిన మహా పథికుడు ఆయన.

స్వరాజ్యం రాకపూర్వం ఉత్తరాంధ్ర పల్లెలో ఏ ప్రాంతాన్ని పరికించి చూసినా బక్కచిక్కిన పల్లెజనం. డొక్కలెండిన పిట్టల్లా మారిన కూలిజనం. పొట్టకోసినా అక్షరం ముక్కలేని నిరక్షరకుక్షులు. ఆ దశలో ప్రజలను చైతన్యవంతం చేయడానికి రాజకీయాలను శక్తివంతమైన సాధనంగా మలిచారు. భావసామ్యం కలిగిన యువకులను కార్యకర్తలుగా ఎన్నుకొని నిసలైన ప్రజా జీవితంలో శిక్షణ ఇచ్చారు. వారిలో కొందరు మెరికల్లాంటి రాజకీయ నాయకులుగా ఎదిగివచ్చారు. లచ్చన్న శిష్యులమంటూ సగర్వంగా చెప్పుకుంటారు. ఆయన నెలకొల్పిన ప్రమాణాలను అందుకోలేని అల్పజీవులూ ఉన్నారు. అన్యాయం, అక్రమం ఎక్కడ ఉన్నా ఎదిరించే మనస్తత్వం ఆయనది. అందుకే ఆయన అధికార పదవుల్లో ఎంతోకాలం కొనసాగలేకపోయారు. రైతుల, కార్మికుల దీనస్థితిలో ఇప్పటికీ చెప్పుకోదగ్గ మార్పు రాకపోవడం చూసిన లచ్చన్న గత ఏడాది జరిగిన తన రాజకీయ వజ్రోత్సవ వేడుకల్లో లేని శక్తిని కూడదీసుకుని మాట్లాడుతూ దేశం ఎటు పోతోందంటూ ఆవేదన చెందారు. పేదలకూ, కర్షకులకూ సేవ చేయాలన్న తపన ఆయన రాజకీయ ప్రస్థానాన్ని నిర్దేశించింది. రైతు బాంధవుడు రంగాకు అనుచరునిగా చేరి సహచరుడి స్థాయికి లచ్చన్న ఎదిగారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని 1951 వరకూ శుద్ధ కాంగ్రెస్ వాదిగా మనగలిగారు. తన సిద్ధాంతానికి విరుద్ధమైనదేదీ సహించలేదు. తక్షణం త్యజించారు. రాజగోపాలాచారి నాయకత్వంలోని స్వతంత్ర పార్టీలో చేరి అందులోనూ గుర్తింపు పొందారు. దేశానికి వెన్నెముక రైతన్నే అన్న నినాదంతో చరణసింగ్ స్థాపించిన లోక్‌దళ్‌పార్టీలో ఈ రాష్ట్రానికి నేత లచ్చన్నే. సోషలిస్టు సమాజ స్థాపనకై లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ పిలుపుపై ఏర్పడిన జనతాపార్టీ రాష్ట్ర నాయకత్వంలో ప్రధాన పాత్ర లచ్చన్నదే. ఇలా ఏ పార్టీ మారినా ప్రజలపక్షాన్ని వీడకుండా తన వల్ల పార్టీలకు గుర్తింపు తీసుకొచ్చిన ప్రజానేత. అందుకనే శ్రీకాకుళం జిల్లాలోని మారుమూల గ్రామలో కూడా ఇప్పటికీ '... ఉత్తరాంధ్రకు లచ్చన ఊపిరి' అనే గీతం వినిపిస్తూనే ఉంటుంది. ఉత్తరాంధ్రలో రైతురక్షణ సంఘాన్ని స్థాపించిన పుల్లెల శ్యామసుందరరావు తోడునీడగా గంజాం జిల్లా రైతుసంఘ కార్యదర్శిగా లచ్చన్న అందించిన సేవలు ఎనలేనివి. చీకటి, తెర్లాం, పర్లాకిముడి, సురంగి ఎస్టేట్లలోని రైతాంగాన్ని ఆయన ఆదుకున్నారు. కురుపాం, బొబ్బిలి జమీందారులపై స్థానిక రైతుల పోరాటానికి సారథ్యం వహించారు. బారువ, ఉర్లాం, ప్రియాగ్రహారం, నందిగాం మైనర్ ఎస్టేట్లపై చావు దెబ్బతీసిన ధీశాలి లచ్చన్న. రైతాంగానికి వెన్నుదన్నుగా ఉంటూ, బలహీన వర్గాల బాగుకోరే పార్టీనే సమర్థిస్తానని చెప్పే లచ్చన్న ఏనాడూ బడాపార్టీల వైపు పరుగులు పెట్టలేదు. దేశాన్ని తప్పుదోవలో నడిపిస్తున్న కాంగ్రెస్‌ను మట్టి కరిపించడమే తన జీవితాశయమనీ, అందుకు ఆయుధంగా ఉపయోగపడే ఏ పార్టీలోనైనా తాను చేరడానికి సిద్ధమేనని ప్రకటించి తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కడదాకా కాపాడుకుంటూ వచ్చారు. అందుకనే ఆచార్య రంగా లచ్చన్న వ్యక్తిత్వాన్ని ప్రసావిస్తూ 'ఉత్తరాంధ్ర తీరంలో నాకు దొరికిన మంచి ముత్యం లచ్చన్న' అని కితాబు ఇచ్చారు.

లచ్చన్న మరణం ఆంధ్రరాష్ట్రానికి తీరని లోటు. ముఖ్యంగా, రైతులూ, శ్రామికులూ, బలహీన వర్గాల ప్రజలు ఒక మహోన్నతమైన నాయకుడిని కోల్పోయారు. ప్రజాసేవే పరమావధిగా, నైతిక ప్రమాణాలే ఊపిరిగా జీవించిన పాత తరం నాయకులలో ముఖ్యుడు ఆయన. తన జీవన శైలితో కొన్ని తరాలను ప్రభావితం చేసిన సర్దార్ లచ్చన్న నిండు జీవితం జీవించి పండులాగా రాలిపోయారు. ఎటువంటి ప్రలోభాలకూ లోనుకాకుండా తాను కోరుకున్న రీతిలో జీవించిన ధన్యజీవి ఆయన. వర్తమాన రాజకీయవాదులు ఆయనను స్ఫూర్తిగా స్వీకరించడమే ఆయనకు నిజమైన నివాళి.











# అంతరార్థం

– శ్రీ రావెల సాంబశివరావు

పేరుకిది లచ్చన్న
సమ్మానమగుగాని
పేదోడి పటిమకిది
పట్టమే సుమ్ము .....
దేశదాస్యము బాప
నడుముగట్టిన వారి
కీర్తి చరితల మనుము
తడవుటే సుమ్ము .....
పేరుకిది .....

రైతుకూలీ రాజ్య
స్థాపనకు జైకొట్టి
నడిపించు వీరులకు
గంధమలదుటె సుమ్ము ...
పేరుకిది ....

పీడితుల తాడితుల
బాధలను బాపగా
'బహుజన'పు శంఖమ్ము
నొత్తుటే సుమ్ము ....
పేరుకిది ....

గురునితో తులదూగు
శిష్యులెల్లరజూచి
'సర్దారు'లని పిలచి
గారవించుటె సుమ్ము
పేరుకిది ....

పదవిదేముందిలే
పేరున్న చాలునను
త్యాగబుద్ధికి మనము
తలయూచుటే సుమ్ము
పేరుకిది ....

# దీప శిఖ

- శ్రీ వడ్డెంగుంట అంకయ్య

"ఉపకృతి సాహసికతయా
క్షతిమీపి గణయంతి నోగుణిన:
జనయంతిహి ప్రకాశం
దీపవిఖా: స్వాంగ దాహేన"

పై శ్లోకములో చెప్పినట్లు దీపశిఖ తన శరీరమును దహించుకొంటు లోకమునకు కాంతి నిచ్చుచున్నది. అట్లే యోగ్యులైన మహానుభావులు తమకు కలిగే కష్టనష్టములను కూడా లెక్కచేయకుండా నిరంతరము తాము సాధక భాదలననుభవిస్తూ పరులకోసము పాటుబడుచు వారి అభ్యుదయమే తమ అభ్యుదయముగా భావించుచుందురు. అట్టి కోవకు చెందినవారే శ్రీ గౌతు లచ్చన్నగారు. ఆయన ఒక దీపశిఖలాంటి వారు. పరులకోసము బ్రతికే త్యాగజీవి.

భారతమాత దాన్యశృంఖలాలను తెగతెంపుటకు విద్యార్థి దశలోనే స్వాతంత్ర సమర రంగమున దూకిన వీరకిశోరము శ్రీ లచ్చన్నగారు. తెల్లదొర తుపాకి గుండ్లకు, లాఠీ దెబ్బలకు వెన్నిచ్చి పిరికిపందవలె పారిపోకుండ గుండెచూపి నిలబడి అఖండ ధైర్యసాహసములు ప్రదర్శించినారు. అందుకే ప్రజలు ఆయనను సర్దార్ లచ్చన్న అన్నారు.

అన్నయైన దశరథరాముని మాటను జవదాటని లక్ష్మణుని లాగ ఆచార్యరంగాజీ అడుగుజాడలలో చాలాకాలము నడచి ఆంధ్ర రాజకీయములలో అద్వితీయమయిన పేరు ప్రఖ్యాతలు గడించినారు. రాజకీయములలో రాజకీయ నాయకులలో మార్పులు చేర్పులు సహజము. సిద్ధాంతపరంగా విబేధించినప్పటికి రంగాగారిని పూజ్య రంగాజీగా గౌరవించటమనేది లచ్చన్న గారి సౌమనస్యమునకు నిదర్శనము.

వారిలో గర్వమనేది ఏకోశాన కనిపించదు. చిన్నవారు గాని, పెద్దవారుగాని, బీదవారుగాని, భాగ్యవంతులుగాని ఎవరు వచ్చిన, ఎప్పుడు వచ్చిన, ఎక్కడకు వచ్చిన, వారి నాదరించి, వారి కష్ట సుఖాలను తెలుసుకొని, వారి కోరిక మేరకు సలహాకాని, సహయముకాని చేసి పంపుటకు శ్రీ లచ్చన్న గారి నిత్యకృత్యమని అందరెరిగిన విషయమే.

యుగయుగముల నుండి, తరతరంబులనుండి కూటికి లేక, గుడ్డకిలేక ఉండటానికి నీడలేక "హాలోరామచంద్రా" యని అలమటించుచు, అట్టడుగున పడియున్న బడుగుజీవుల చీకటి బ్రతుకులలో కొంచెము వెలుగు చూపి వారినుద్ధరించుటకు కంకణము కట్టుకున్న శ్రీ లచ్చన్న గారి జీవిత చరిత్ర పరమ పవిత్రమైనది. ఆంధ్రదేశములో నూటికి ఎనబైమందివున్న వెనుకబడిన జాతులు, షెడ్యూల్డు తరగతులు, షెడ్యూల్డు జాతులు మైనార్టీవారిలో చైతన్యము కలిగించి, మానవులుగా తీర్చిదిద్ది, సరియైన మనుగడ సాగించడానికి సాంఘిక, ఆర్థిక, వైజ్ఞానిక, రాజకీయరంగములలో సమతను సాధించడానికి నిరంతరము కృషిసల్పుతున్న తపోధనుడు శ్రీ లచ్చన్నగారు.

బహుజనోద్ధరణకోసము, బడుగుజీవుల శ్రేయస్సుకోసము తన స్థిర, చరాస్తులను తాకట్టుపెట్టి తుదకు తెగనమ్మి బహుజన పత్రికను స్థాపించి, జీవిత సర్వస్వము నర్పించిన త్యాగశీలి లచ్చన్నగారని అందరికి తెలిసిన విషయమే.

"ఏ గ్రామంపోయిన, ఏ నగరం పోయిన, గౌతులచ్చన్న గారు వచ్చారట, పోదాంరండి, చూద్దాంరండి, పలుకరించివద్దాం రండి" అని తండోప తండలుగ, కులమత వర్గ భేదము లేకుండ వచ్చి వారిని గోరవించుచున్నారంటే ప్రజల హృదయాలలో వారి మంచితనమెంత హత్తుకుపోయిందో విదితమగుచున్నది.

శ్రీకాకుళం జిల్లాలోనేగాక, ఇతర జిల్లాల్లోకూడ రాజకీయానుభవంలేని యువకులకు రాజకీయాలు నేర్పి, వారిని ప్రజా ప్రతినిధులుగా గెలిపించిన ఘనత శ్రీ లచ్చన్నగారికే దక్కుతుంది. చేపట్టిన కార్యక్రమము నెరవేరువరకు రాత్రింబగళ్లు విశ్రమించని వీరి కార్యదీక్ష, కార్యదక్షతలు ప్రశంసనీయములు.

గీత కార్మికులకోసము సత్యాగ్రహములు, నిరసన వ్రతములు సాగించి తుదకు కర్నూలులో రాష్ట్రమంత్రి వర్గమునే పడగొట్టి ఆంధ్ర చరిత్రలో సువర్ణాక్షరములలో లిఖింపదగిన సుస్థిరచరిత్రను నెలకొల్పిన కీర్తి, ఘనత శ్రీ లచ్చన్నగారికి దక్కినదనుటలో అతిశయోక్తి లేదు. ప్రజాశ్రేయస్సుకు, తన భావ స్వాతంత్రమునకు భంగము కలిగిన సందర్భములలో తన శాసన సభ్యత్వాన్ని మంత్రి పదవిని కూడా త్యజింపగల ఆత్మాభిమానము వ్యక్తిత్వముగల త్యాగ పురుషుడు శ్రీ లచ్చన్నగారు.


రాజకీయ సిద్ధాంతములు వేరైనను, కుల, మత, వర్గ భేదము లేకుండ ప్రతి నాయకునితో లచ్చన్నగారి సత్సంబంధాలు, సన్నిహిత సౌహార్ధభావాలు కలిగియున్నారంటే వారి సౌశీల్యానికి విశాల హృదయానికి ఇంత కంటే తార్కాణమేమి కావాలి?















ఆది గురువు పుల్లెల శ్యామసుందర్















# నీతిబద్ధరాజకీయాల "గౌతు" లచ్చన్న

రాష్ట్రంలో పాతతరం రాజకీయనాయకుల శకం దాదాపుగా ముగిసింది. కుటిల రాజకీయాలకు దూరంగా అడుగడుగునా పోరాటాలు చేసి నిత్యం ప్రజల పక్షాన నిలిచిన సర్దార్ గౌతు లచ్చన్న మరణంతో తెలుగుజాతి శోకసంద్రంలో మునిగింది. 1909లో మన రాష్ట్రంలో చాలా వెనుకబడిన ప్రాంతమైన సోంపేటలో జన్మించి తెలుగువాడు గర్వంగా చెప్పుకునే రీతిలో రాజకీయాలు నడిపిన లచ్చన్న నిజాయితీకి మారుపేరు. క్విట్ ఇండియా ఉద్యమంలోను, ఉప్పుసత్యాగ్రహ సమయంలోను జైలుకెళ్లి పోరాట స్ఫూర్తిని రగిల్చారు. 1937లో ఆనాటి జమిందారీ వ్యవస్థకు నిరసనగా రైతు రక్షణయాత్ర పేరిట ఇచ్ఛాపురం నుంచి తడ దాకా పాదయాత్రచేసి సాటిలేని పోరాట పటిమను లచ్చన్న కనబరిచారు. ఈ ఉద్యమ ఫలితంగానే రైతుకు వడ్డీరేటు 50 పైసలకు మించకూడదన్న నిబంధన రూపుదిద్దుకుంది.

1942లో క్విట్ ఇండియా పోరాటంలో కీలకభూమికను పోషించి తద్వారా లచ్చన్న రాజకీయంగా పునాదులు నిర్మించుకున్నారు. ఉమ్మడి మదరాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టడంలో భాగంగా ఆస్తులు పంచుకునే కమిటీకి నీలం సంజీవరెడ్డి, తెన్నేటి విశ్వనాథం తదితర ఉద్దండుల సరసన ప్రాతినిధ్యం వహించిన లచ్చన్న ఈ కమిటీలో ఆంధ్ర తరపున కీలక భూమికను పోషించారు. 1947లో విశాఖ – గోదావరి జిల్లాల క్రింద సంయుక్తంగా ఉన్న కార్మిక నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున అసెంబ్లీకి ఎన్నికైన లచ్చన్న అంచెలంచెలుగా రాష్ట్ర రాజకీయాలపై తనదైన చెరగని ముద్ర వేసుకున్నారు. బర్మా (ప్రస్తుత మయన్మార్) అంతర్యుద్ధంలో తెలుగువారి తరపున అక్కడ పోరాటం చేయడానికి వెళ్ళిన లచ్చన్నకు అప్పటి ఏఐసిసి అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ స్వయంగా ఎన్నికల్లో పోటీ చేయమని ఆహ్వానం పంపారు. ఈ మేరకు కార్మిక నియోజకవర్గంలో కమ్యూనిస్టులను ఓడించి చట్టసభలోకి కాలుపెట్టిన లచ్చన్న ఇక వెనుదిరగలేదు. 1952లో కృషికార్ లోక్‌పార్టీ తరపున 16 సీట్లు నెగ్గి ఉమ్మడి రాష్ట్రంలో కమ్యూనిస్టులు ప్రభుత్వాన్ని స్థాపించకుండా అడ్డుకోగలిగారు. పదవులు పొందకుండా లచ్చన్న బయటనుంచి నైతిక మద్దతును ఇచ్చి నీతిమయ రాజకీయాలకు శ్రీకారం చుట్టారు.

### ప్రలోభాలకు లొంగనివాడు

ఉమ్మడి రాష్ట్రంనుంచి ఆంధ్ర విడిపోయిన తరువాత అప్పటి ప్రకాశం కేబినెట్‌లో విద్యుత్ మంత్రిగా తెన్నేటి, పట్టాభి, దామోదరం, తిమ్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరుల సహచరునిగా పనిచేశారు.

ఈ శాఖలో సంస్కరణలకు అప్పట్లోనే శ్రీకారం చుట్టారు. అప్పట్లో కర్నూలును శాశ్వత రాజధాని చేయాలని కాంగ్రెస్ నాయకులు ప్రతిపాదించగా ఇందుకు భిన్నంగా లచ్చన్న, రంగా తదితరుల తిరుపతిని సూచించారు. దీంతో కేబినెట్‌లో విభేదాలు వచ్చి లచ్చన్న మంత్రి పదవిని త్యజించారు. కల్లుగీత కార్మికుల సమస్యలపై నాటి ముఖ్యమంత్రి ప్రకాశంపంతులుపై అవిశ్వాసాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టి అందులో విజయం సాధించిన లచ్చన్న ఎక్కడా ప్రలోభాలకు తలొగ్గలేదు. 1955 మధ్యంతర ఎన్నికల్లో ఎన్.జి. రంగా సారధ్యాన కృషికార్ లోక్ పార్టీ, ప్రకాశం ప్రజాపార్టీ, కాంగ్రెస్ పార్టీలు ఐక్యకాంగ్రెస్‌గా జెజవాడ గోపాల రెడ్డి సారధ్యాన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. పెద్దమనుషుల ఒప్పందంలో సంతకం చేసిన లచ్చన్న ఆ తరువాత విభేదాల నేపథ్యంలో పలువురు సీనియర్ నాయకులను కలుపుకుని స్వతంత్ర పార్టీని ఏర్పాటు చేశారు. ఈ పార్టీ లచ్చన్న ప్రభావంతో 1962 ఎన్నికల్లో శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో 11 స్థానాలను సాధించింది. అదే వరవడిలో 1967 ఎన్నికల్లో సోంపేట నుంచి అసెంబ్లీకి, శ్రీకాకుళం నుంచి లోక్‌సభకు ఎన్నికయిన లచ్చన్న తన గురువు రంగాకోసం శ్రీకాకుళం స్థానాన్ని త్యాగం చేశారు. ఆ ఎన్నికల్లో చిత్తూరు నుంచి ఓడిపోయిన రంగా శ్రీకాకుళంలో లచ్చన్న ప్రభావంతో లోక్‌సభలో వెళ్ళారు 1972 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తులసీదాస్ చేతిలో ఓడిపోయినా శాసన మండలికి ఎన్నికయ్యారు. జై ఆంధ్ర ఉద్యమంలో తన పదవికి రాజీనామా చేసి పోరాటం సాగించారు. 1972లో రంగా కాంగ్రెస్‌లో చేరినా లచ్చన్న సైద్ధాంతిక రాజకీయాలకోసం స్వతంత్ర పార్టీలోనే కొనసాగారు. ఆ తరువాత దీనిని లోక్‌దళ్‌లో విలీనం చేశారు. 1978 ఎన్నికల్లో జనతా పార్టీ తరపున తిరిగి పోటీచేసి విజయం సాధించడమే కాకుండా ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో గుర్తింపు పొందిన తొలి ప్రతిపక్షపార్టీకి అసెంబ్లీలో నాయకత్వం వహించారు. ఎమర్జెన్సీ హయాంలో నిర్బంధాన్ని అనుభవించిన లచ్చన్న జెపి ఉద్యమంలో కీలక భూమికను పోషించారు. ప్రతిపక్ష నాయకునిగా కీలక భూమికను పోషించిన లచ్చన్న జనతా పార్టీ చీలిపోవడంతో లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగారు. 1983 ఎన్నికల్లో ఓడిన లచ్చన్న ఆ తరువాత క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు.

### తుదివరకూ చెరగని నిబద్ధత

రైతులు, కల్లుగీత కార్మికుల సమస్యలపైన నిత్యపోరాటం చేసిన లచ్చన్న జీవితాంతం వారికోసమే కృషిచేశారు. తన అనుచరులను టిడిపిలో చేర్చి తాను మాత్రం పార్టీ మారకుండా నిబద్ధతను పాటించారు. తుదిశ్వాస వరకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రాజకీయాలు నడిపారు. అధికారం కోసం అర్రులు చాచకుండా పార్టీలు మారకుండా సిద్ధాంతం కోసం ఆయన కృషిచేశారు. కాంగ్రెస్‌లో ఆయన ఇతర నాయకులతో విభేదాలు లేకుండా మెలగి ఉండుంటే చాలా సులభంగా ముఖ్యమంత్రి అయి ఉండే వారేమోనని చెప్పవచ్చు. టిడిపితో సన్నిహిత సంబంధాలు నెరిపి ఉంటే తిరుగులేని నాయకునిగా కొనసాగేవారు. ఎక్కడకు వెళ్ళినా తన వెంట పుస్తకాలు, మూలికలు (వైద్యంకోసం), ఇతర సామగ్రిని తీసుకెళ్ళే లచ్చన్న రోడ్డు ప్రయాణం ద్వారా వేలకొలదీ కిలోమీటర్లు వెళ్లేవారు. దారిపొడుగునా తన పార్టీకేడర్‌ను కలుసుకుంటూ వారిలో నూతన చైతన్యాన్ని నింపేవారు. తాను పుట్టిన ప్రాంతం కోసం, నమ్ముకున్న వారికోసం ఎన్నో సుదీర్ఘ పోరాటాలు చేసిన లచ్చన్నను ఆంధ్ర, నాగార్జున వర్సిటీలు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించాయి. రాజకీయాల్లో తనదైన శైలిలో సిద్ధాంతాల కోసం పోరాటం జరిపిన డాక్టర్ లచ్చన్న నేటి తరం నాయకులకు ఒక పాఠ్యపుస్తకం వంటివారు. ఆయన చేసిన పోరాటాలు తెలుగు జాతికి ఎన్నటికీ స్ఫూర్తిదాయకాలు.














35 సం॥లు రథసారధి డ్రైవర్ బలరామ్






## సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళి



ఉద్యమాలకు ఊపిరిపోసినవాడు మన లచ్చన్న. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా వెలుగొందినాడు. వెనుకబడిన తరగతులకు వెన్నుదన్నుగా నిలచినాడు. శ్రీకాకుళ సీమలోన సింహబలుడుగా, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవముగా కొలబడ్డాడు. రైతు యాత్రలు నడిపినాడు. రైతు రంగా దారిలో నడిచాడు. కల్లుగీత కార్మికోద్యమాలు కొనసాగించాడు. క్విట్ ఇండియా ఉద్యమములోను ముందునడిచాడు. దేశమాత స్వేచ్ఛకోరి దేశసేవ చేశాడు. జనుల మెప్పుపొంది సర్దారుగా కీర్తింపబడ్డాడు సర్దార్ లచ్చన్న. గాంధీ బాట సాగినాడు, గాంధిమాట చాటినాడు. రైతు నేత రంగాజీ రైతాంగపు శిక్షణలో పాల్గొన్నాడు. రైతు రక్షణ యాత్రలో దేశమంతా తిరిగినాడు. మంత్రి పదవి వచ్చినపుడు హరిజనులూ, గిరిజనులూ, పురజనులని చాటినాడు. సొంత ఊరు బారు వంద హరిజనుల ఉద్ధరించె మనుషులంత ఒకటేయనుచు మానవతను చాటిచెప్పి, శ్రమజీవుల బంధువుగా, చైతన్యపు సింధువుగా, బడుగు జనుల దేవుడుగా, బతుకుతున్న మహానేత 98వ ఏట ప్రజలనుదుట మహా సంద్రాన్ని సృష్టించి విలపింపజేసె. సర్దారుకిదే ఘన నివాళి.

# మరపు రాని సర్దార్!



స్వాతంత్ర్య సమరయోదులు, రైతు బాంధవులు సర్దార్ గౌతు లచ్చన్న మరిక లేరన్న దుర్వార్త తెలుగువారిని శోక పరితప్తుల్ని చేసింది. మాతృదేశ దాస్య విముక్తికి సమరశంఖం పూరించి సమర రంగంలోకి దూకి ఎందరినో ఉత్తేజితుల్ని చేసిన అలనాటి వీరుల శకం, ఇప్పుడాయన అస్తమయంతో దాదాపుగా తుడిచి పెట్టుకు పోయింది. భౌతికంగా కనుమరుగు కావచ్చుగాక – ఏడు దశాబ్దాలకు పైబడిన ప్రజాజీవితంలో అలుపెరగని అవిశ్రాంత యోధుడనిపించుకొన్న గౌతు లచ్చన్న తన సమకాలీన రాజకీయాలపై వేసిన విశేష ముద్ర చెరిగిపోనిది. ఉద్యమపంథాలో ఆయన శైలి విలక్షణమైనది. తొంభై ఏడేళ్ల సర్దార్ జీవితం, ఒక్కముక్కలో – ఉద్యమభరితం. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు కెళ్లారు. సహాయ నిరాకరణోద్యమం, హరిజనోద్యమాల్లో చురుకుగా పాలుపంచుకొని జాతీయస్థాయిలో పలువురి దృష్టిని ఆకర్షించారు. రైతు మహాయాత్ర, క్విట్ ఇండియా ఉద్యమాల సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఆయన పోషించిన కీలక పాత్ర ప్రశంసలందు కుంది. జాగీర్దారీ, ఇనామ్‌దారీ రైతుల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం సాగించిన వ్యక్తిగా గౌతు లచ్చన్న సాధించుకున్న చిరయశస్సు ఎన్ని తరాలకైనా తరగనిది. రైతులు, కూలీలు, చేతి వృత్తులకు చెందిన అశేష గ్రామీణశ్రామికజనుల గుండెసవ్వళ్లను ప్రతిధ్వనింప జేసిన గౌతు లచ్చన్న చెక్కుచెదరని పోరాట స్ఫూర్తికి నిలువెత్తు ప్రతీక. పదవుల్లో ఉన్నా లేకున్నా ప్రజల కోసమే పనిచేసే తరానికి చెందిన అరుదైన వ్యక్తిని కోల్పోయినందుకే నేడు తెలుగుతల్లి కంటతడి!

'ఒకప్పటి రాజకీయాలు వేరు .. ఆనాటి పద్ధతులు ఇప్పటి రాజకీయాలకు పనికిరావు .. జనాన్ని కాపాడేది ప్రజాస్వామ్యమని గతంలో అధిక సంఖ్యాకులు విశ్వసించేవారు .. తమకేది లాభదాయకమో అదే ప్రజాస్వామ్యమని భావించే నాయకులు ప్రస్తుతమున్నారు!' స్వాంతత్ర్య స్వర్ణోత్సవాల నేపథ్యంలో సర్దార్ లచ్చన్న వెలిగక్కిన ఆవేదన అది. కౌమార ప్రాయంలో ఉద్యమాలే ఊపిరిగా ఆయన రాటుతేలిన కాలం వేరు. రాజకీయ రంగాన్ని రాబడి మార్గంగా దిగజార్చేసిన ఇప్పటి క్షీణవిలువల జమానా వేరు. ఊహాతీత స్థాయిలో ప్రమాణాల పతనాన్ని ఆయన జీర్ణించుకోలేకపోవడం సహజమే. నిష్కళంక చరిత్ర కలిగిన నేతగా, రైతు ఉద్యమాల తొలి సారథిగా, రాజకీయ భీష్ముడిగా ఖ్యాతి గడించిన ప్రొఫెసర్ ఎన్.జి. రంగాను లచ్చన్న తన రాజకీయ గురువుగా భావించేవారు 'ఉత్తరాంధ్ర తీరంలో నాకు దొరికిన మంచి ముత్యం సర్దార్ లచ్చన్న!' అని రంగా మురిసిపోయేవారు. ఈ గురుశిష్య బంధం ఇరువురి వ్యక్తిత్వాలు, ధోరణుల్లో ఎన్నో సామ్యాలకు ప్రతిబింబం. రాజకీయ రంగంలో ప్రజాసేవా కార్యక్రమాల్లో సుదీర్ఘకాలం గడిపినా పదవుల పట్ల ఆసక్తి చూపని మూర్తిమత్వం రంగా సొంతం. శాసన సభ్యుడిగా మంత్రిగా ఎదిగినా పదవుల్ని పట్టుకు వేళ్లాడకపోవడం లచ్చన్న లక్షణం. ప్రజాసేవ, రైతు ఉద్ధరణలే జీవితాశయాలుగా ఇద్దరూ సాగిపోయారే తప్ప ప్రలోభాలకు లోబడలేదు. ఇద్దరికిద్దరూ ఎన్నో పార్టీలు మారారు. ఆ మార్పులు సిద్ధాంతపరమైన కారణాలతోనే తప్ప, పదవీ లాలసతో కానే కాదు. 'పదవుల కోసం ఇంకో పక్షంలో చేరడం మాకు తెలీదు... నేడు స్వార్థరాహిత్య రాజకీయాలకు అవకాశమే లేదు' అని వ్యాఖ్యానించడం ద్వారా కుళ్లు పాలిటిక్సును ఎనిమిదేళ్లనాడు సర్దార్ లచ్చన్న ఏవగించుకున్నారు. దీటైన చేతలతో మకిలంటని మాణిక్యమనిపించుకున్నారు.

గౌతు లచ్చన్న పేరు వినగానే స్ఫురణకొచ్చే ఘట్టాల్లో మద్యనిషేదం ఒకటి. ముప్పై దశకంలో సహాయ నిరాకరణోద్యమానికి నాందిగా గాంధీజీ ప్రకటించిన సూత్రాల్లో కీలకమైంది. మద్యపాన నిషేధచట్టం చేయాలన్నది. కల్లుగీతపై ఆధారపడ్డ కుటుంబంలో కన్ను తెరిచిన లచ్చన్న మద్యపాన వ్యతిరేకోద్యమానికి తన ఇంటనే శ్రీకారం చుట్టడం అబ్బురపరచే విషయం. తండ్రిచేత మద్యపానాన్నే కాదు, కుటుంబవృత్తినీ నిలుపుచేయించిన లచ్చన్నే అనంతర కాలంలో కనబరచిన భిన్నవైఖరి – రాష్ట్ర రాజకీయాన్నే మలుపు తిప్పింది. 1954 నాటికి ఆంధ్ర రాష్ట్రంలో మద్యనిషేద చట్టం అమలులో ఉండేది. కొందరు అసెంబ్లీ సభ్యులు ఆ చట్టం రద్దుకు డిమాండు చేయడంతో ప్రకాశం ప్రభుత్వం అప్పట్లో రామమూర్తి కమిటీని నియమించింది. మద్యనిషేధాన్ని ఎత్తేయాలని ఆ కమిటీ సిఫార్సు చేసింది. కల్లుగీత కార్మికుల బతుకుతెరువును కాపాడేందుకు రామమూర్తి కమిటీ సిఫార్సుల్ని అమలు చేసి తీరాలని గట్టిగా పట్టుపట్టినవారిలో లచ్చన్న ఉన్నారు. కడకు విపక్షాలు తెచ్చిన అవిశ్వాస తీర్మానం ఒక్క ఓటు తేడాతో నెగ్గి ప్రకాశం ప్రభుత్వం పరాజయం పాలయింది. ఆ విధంగా ఆంధ్రరాష్ట్ర చరిత్రలోని సంక్లిష్ట ఘట్టంలో 'నిర్ణయాత్మక పాత్రధారి'గా లచ్చన్న ఎన్నటికీ మరపురారు. ప్రత్యేక రాష్ట్రంపైనా తొలినాటి దృక్పథానికి బిన్నమైన ధోరణిని ఆయన కనబరచారు. 'నేడు ప్రత్యేక తెలంగాణకావాలని పదవుల కోసం పాటుపడేవారే అంటున్నారు .. ప్రజల్లో స్పందన కనిపించడంలేదు' అని కుండ బద్దలుకొట్టిన నిర్భీకత ఆయనది. పర్యవసానాలు ఏమైనప్పటికీ వెరపన్నది లేకుండా నమ్మినదాన్నే పైకి చెప్పడం, చెప్పిందే చేయడం లచ్చన్న సహజ నైజాలు. ఈ స్వభావమే బలహీన వర్గాలకు ఆయనను పెద్దదిక్కు చేసింది. లెక్కకు మిక్కిలి శత్రువుల్నీ సృష్టించింది. గౌతు లచ్చన్న జీవితం తెరిచిన పుస్తకం. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడ్డారు. ప్రజాజీవితంలో విలువలు బొత్తిగా కొరవడుతున్నాయని జీవన మలిసంధ్యలో ఎంతగానో పరితపించారు. కళంకిత రాజకీయ వాతావరణం తేటపడేందుకు బహుముఖ కృషి సాగించడమే సర్దార్ గౌతు లచ్చన్న దివ్యవస్మృతికి సరైన నివాళి.











# గౌతు లచ్చన్న బలహీన వర్గాలసంస్థ

## Gouthu Latchanna Organisation for Weaker sections



Printed by GLOW, Visakhapatnam

Concept Designed & Published by V.C. Yarlagadda